క్లుప్తంగా

ఆకట్టుకున్న కంజరి కథ


కంజరి కథ ప్రదర్శిస్తున్న కళాకారులు

నిడదవోలు: కంజరి కథ శ్రోతలను అలరించింది. స్థానిక గణేశ్ చౌక్ సెంటర్లోని శ్రీపూజా గణపతి కుమారస్వామి వారి ఆలయం వద్ద గణపతి నవ రాత్ర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఈ సాంస్కృతిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. హాస్య భరితంగా సాగిన కంజరి కథను భక్తులు శ్రద్ధగా విని ఆనందించారు. కళాకారులు తమ ప్రదర్శనతో శ్రోతలను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కారింకి సాయిబాబు మాట్లాడుతూ గణపతి నవరాత్ర ఉత్సవాల్లో కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సత్యహరిశ్చంద్ర నాటకం, భరత నాట్య ప్రదర్శన, అలాపన సినీ మ్యూజికల్ నైట్, కర్నాటక కాంతార స్పెషల్ షో ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ కారింకి నాగేశ్వరరావు, తోలేటి కోటేశ్వరరావు, సరిదే సత్యం, లక్కంసాని సూర్యారావు, ఎం. గంగారావు, దుళ్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ఆయేషాబేగం

ఉండ్రాజవరం: ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్‌లో భాగంగా మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. తణుకు పట్టణానికి చెందిన నిస్సా హాస్పిటల్ గైనకాలజిస్టు ఆయేషా బేగం గర్భిణులకు పరీక్షలు చేసి తగు సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఆ పీహెచ్‌సీ వైద్యుడు ఆర్ఎస్ఎస్‌వీ ప్రసాద్, సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కె.కుమారి, స్టాఫ్ నర్సు సంధ్య, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో అధికారులు ఉండేలా చర్యలు

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ ఉధృతి నేపథ్యంలో మండలంలోని ఐదు గ్రామాల్లో ముందస్తుగా ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో నియమించిన అధికారులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని జిల్లా సూక్ష్మపారుదల పీడీ, మండల ప్రత్యేకాధికారి ఎ.దుర్గేష్ మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ నిడదవోలు జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు ఈనెల 9న మండలంలోని కంసాలిపాలెం, రావిమెట్ల గ్రామాల్లోని పునరావాస కేంద్రాలను పరిశీలించినపుడు కొంతమంది గ్రామస్థాయి అధికారులు అందుబాటులో లేరని తన దృష్టికి వచ్చిందన్నారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశాల మేరకు పునరావాస కేంద్రాల్లో ఆరోగ్య వైద్య శిబిరాలు, విడతల వారిగా అధికారులను నియమించినట్టు ఆయన పేర్కొన్నారు.

వైద్యులు నల్ల బ్యాడ్జీలతో విధులకు


నల్లజర్ల పీహెచ్‌సీలో నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు

నల్లజర్ల: జీవో నంబర్ 85ను రద్దు చేయాలని కోరుతూ నల్లజర్ల, పోతవరం పీహెచ్‌సీల్లో పని చేస్తున్న వైద్యులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. వైద్యుల సర్వీసు కోటాను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ తాము దశల వారీ పోరాటానికి దిగినట్టు వైద్యులు గంగాధరరావు, సిరాజుద్దీన్ తెలిపారు. అప్పటికీ తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఈనెల 15న ఛలో విజయవాడ, 16న నిరవధిక నిరాహార దీక్షలతో ఆందోళనను తీవ్రతరం చేస్తామని వివరించారు. న్యాయమైన కోర్కెల సాధనకు పీహెచ్‌సీ వైద్యులు జరుపుతున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ వైద్య ఉద్యోగుల సంఘం నాయకులు జీవీవీ ప్రసాద్ ప్రకటించారు.

ఉండ్రాజవరం: జీవో నంబర్ -85ను రద్దు చేయాలని కోరుతూ ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యురాలు మంగళవారం నల్లబ్యాడ్జీ ధరించి విధులు నిర్వహించారు. జీవో నంబర్ 85కు వ్యతిరేకంగా ఏపీ స్టేట్ ప్రైమరీ హెల్త్ సెంటర్స్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యురాలు ఆర్.ఉషాదేవి నల్లబ్యాడ్జీ ధరించి రోగులకు సేవలను అందించారు.

కుట్టు, మగ్గం వర్క్‌లో శిక్షణ

రాజమహేంద్రవరం సిటీ: స్వర్ణాంధ్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గం వర్క్, టైలరింగ్ కోర్సులలో శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకుడు డాక్టర్ గుబ్బల రాంబాబు తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ కోర్సులలో ప్రవేశానికి పదో తరగతి చదివిన వారికి అవకాశం ఉందన్నారు. సెప్టెంబర్ 15 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, 23 వరకూ అడ్మిషన్లకు అవకాశం ఉందన్నారు. 45 రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో మెటీరియల్, మధ్యాహ్న భోజనం ఉచితంగా అందిస్తామన్నారు. ఆసక్తి కలవారు 98498 47489, 94907 10850 నంబర్లను సంప్రదించాలన్నారు.

వాంబే కాలనీ.. సమస్యలు చూడు

- రెండు రోజులకోసారి ట్యాంకర్ ద్వారా తాగునీరు
- మురుగు నీటి నిల్వతో రోగాలు
- వెలగని వీధిలైట్లు.. చీకట్లోనే జీవనం
- మున్సిపల్ ఆఫీసు వద్ద కాలనీ మహిళల నిరసన



మునిసిపల్ ఆఫీసు ఎదుట నిరసన తెలుపుతున్న వాంబే కాలనీ వాసులు

కొవ్వూరు: గోదావరి నది ఒడ్డునే జీవించే తమ గొంతులు దాహంతో ఎండిపోతున్నాయని స్థానిక 15వ వార్డు పరిధిలోని వాంబే కాలనీ వాసులు వాపోతున్నారు. రోడ్డు కం రైలు వంతెన దిగువ ప్రాంతంలో నివసించే తమకు రెండు రోజులకు ఒకసారి ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారని వారు పేర్కొంటున్నారు. గత పది రోజులుగా తాగునీటి కోసం కటకటలాడుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. వాంబే కాలనీ మహిళలు మంగళవారం కొవ్వూరు మునిసిపల్ కార్యాలయానికి వచ్చి మేనేజర్ రాధాకృష్ణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం కార్యాలయం ఎదుట వారు కొంతసేపు నిరసన వ్యక్తం చేశారు. కాలనీలో రాత్రి పూట వీధిలైట్లు వెలగడం లేదని, విషసర్పాల సంచారంతో భయపడుతూ జీవించాల్సిన దుస్థితి నెలకొందని వివరించారు. ఈ కాలనీకి తాగునీటి పైప్‌లైన్ లేకపోవడంతో కొన్నేళ్లుగా మున్సిపాలిటీ ట్యాంకర్ ద్వారానే తాగునీటిని సరఫరా చేస్తోంది. ఇక్కడికి తాగునీరు సరఫరా చేసే ట్యాంకర్‌ను ఇటీవల విజయవాడ వరద ప్రభావిత ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు పంపినట్టు అధికారులు చెబుతున్నారు. ఈ కాలనీని ఆనుకుని ఉన్న రైల్వే స్థలంలో మురుగునీరు భారీగా నిలిచి పోవడంతో మురికి కూపంలా తయారైంది. గతంలో ఏటా వర్షాకాలంలో ఇక్కడి నీటిని మోటార్ల సాయంతో బయటకి తోడేవారు. ఈ ఏడాది నీటిని తోడకపోవడంతో సుమారు నాలుగైదు అడుగుల లోతున నీళ్ల నిలిచిపోయాయి. ఆ నీరంతా పసరు పట్టి దుర్గంధ భరితంగా మారిందని వాంబే కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధిలైట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని, తాగునీటి ట్యాంకర్ల కొరత వల్ల ఇబ్బంది ఉందని మున్సిపల్ మేనేజర్ రాధాకృష్ణ వారికి బదులిచ్చారు. వారి సమస్యలన్నీ అధికారులు, పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

స్పందించిన చైర్ పర్సన్

కాగా వాంబే కాలనీ వాసుల సమస్యలపై మునిసిపల్ చైర్‌పర్సన్ బావన రత్న కుమారి స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు మున్సిపల్ వీధి లైట్ల విభాగం, సిబ్బంది హుటాహుటిన స్పందించి వాంబే కాలనీలోని వీధి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకున్నారు.

అంటురోగాలు ప్రబలుతున్నాయి



మా ప్రాంతం అపరిశుభ్రంగా ఉండడంతో అనేక మంది పిల్లలు,పెద్దలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నాం. జ్వరాలు, వాంతులు, విరేచనాల వంటి సమస్యలు అధికంగా ఉన్నాయి. పారిశుధ్య సిబ్బంది కనీసం మా ప్రాంతాన్ని శుభ్రం చేయడం లేదు. అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలి.

– మాసా శాంతమ్మ, వాంబే కాలనీ, కొవ్వూరు

శివారు ప్రాంతమని నిర్లక్ష్యం



పట్టణ శివారు ప్రాంతం కావడంతో మా ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. తాగు నీటి సరఫరా లేదు. వీధిలైట్లు వెలగడం లేదు. పారిశుధ్యం బాగోలేకపోయినా మా బాధలు ఎవరికి పట్టడం లేదు. కుక్కల బెడద అధికంగా ఉంది. మా ప్రాంత సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– బెండా లక్ష్మి, వాంబే కాలనీ, కొవ్వూరు

తాగునీటికి కటకట



రెండు రోజులకొకసారి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. సమీపంలో గోదావరి నది ఉన్నప్పటికీ, ప్రస్తుతం వరద నీరు ఎర్రగా వస్తుండడంతో వినియోగించుకునే అవకాశం ఉండడం లేదు. దీంతో తాగునీరు, వాడకం నీటికి కటకట లాడుతున్నాం.

– మరపట్ల చిన్నారి, వాంబే కాలనీ, కొవ్వూరు

వీధిలైట్లు వెలగడం లేదు



కాలనీలోని వీధిలైట్లలో ఒక్కటి కూడా వెలగడం లేదు. అంధకారంలో జీవనం సాగిస్తున్నాం. విష సర్పాల సంచారం ఎక్కువైంది. సోమవారం రాత్రి మా ప్రాంతంలో మూడు పాములను చంపారు. రైల్వే స్థలంలో మురుగునీరు నిల్వ ఉండడంతో ఆ ప్రాంతం పాములకు ఆవాసంగా మారింది. తక్షణం వీధిలైట్లు ఏర్పాటు చేయాలి.

– మట్టా గుబ్బాలమ్మ, వాంబే కాలనీ, కొవ్వూరు

గండి చెరువును పరిశీలించిన కలెక్టర్



యర్నగూడెంలో గండి చెరువును పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

దేవరపల్లి: భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న యర్నగూడెం గ్రామంలోని గండి చెరువును మంగళవారం జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. సుమారు 97 ఎకరాల విస్తీర్ణం గల చెరువు నిండుగా ఉంది. ఈ చెరువు కింద సుమారు 300 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువుకు చెక్ డ్యామ్ నిర్మాణానికి ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు పంపించగా, చెరువును జిల్లా కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. చెరువు వివరాలను తహసీల్దార్ కె.రాజ్యలక్ష్మిని కలెక్టర్ ప్రశాంతి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ డి.వెంకటేష్, వీఆర్వో ఎం. శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని ఊరేగింపు


ముక్కామలలో వినాయకుడి ఊరేగింపు

పెరవలి: మండలంలోని ముక్కామల గ్రామంలో మంగళవారం వినాయకుడి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. బ్యాండ్ మేళాలు, బాజా భజంత్రీలతో పూల మండపంలో వినాయకుడి విగ్రహాన్ని ఊరేగించారు. గ్రామంలోని ప్రతి ఇంటి వద్దా వినాయక వాహనాన్ని నిలిపి భక్తుల అందించే కానుకలు స్వీకరించి ముందుకు సాగారు. అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు.

అవంతీ ఫీడ్స్ రూ.2 కోట్ల విరాళం


సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న అవంతీ ఫీడ్స్ అధినేత అల్లూరి ఇంద్రకుమార్

కొవ్వూరు: విజయవాడ వరద బాధితుల సహాయార్థం కొవ్వూరు పట్టణానికి చెందిన అవంతీ ఫీడ్స్ అధినేత అల్లూరి ఇంద్రకుమార్ రూ.2 కోట్ల విరాళం చెక్కును మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి తాడేపల్లిలో మంగళవారం అందజేశారు. బాధితులకు అవంతీ గ్రూప్ తరఫున మొదటి నుంచీ ఆహారం, మంచినీరు అందిస్తున్నామని ఇంద్రకుమార్ చెప్పారు. అవంతీ గ్రూపు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అల్లూరి నిఖిలేష్ కూడా ఆయన వెంట ఉన్నారు.

17న అనంత పద్మనాభస్వామి వ్రతం

సీటీఆర్ఐ: గాడాలలోని మహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామి పీఠంలో ఈ నెల 17వ తేదీన 108 జంటలతో అనంత పద్మనాభస్వామి వ్రతం నిర్వహిస్తున్నామని పీఠాధిపతి చిన్న వెంకన్నబాబు స్వామీజీ తెలిపారు. స్థానిక జయశ్రీ గార్డెన్స్‌లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. స్వామీజీ మాట్లాడుతూ అరణ్యవాసం చేస్తున్న పాండవులకు శ్రీకృష్ణుడు ఈ వ్రతాన్ని ఉపదేశించాడన్నారు. ఈ వ్రతం ఆచరించి రక్ష ధరిస్తే అద్భుత ఫలితాలు కలుగుతాయని తెలిపారు. పీఠం జాతీయ సహాయ కార్యదర్శి మద్ది శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఉభయ రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ మాట్లాడుతూ ఆసక్తి కలవారు 86888 88999 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కడియం: ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు హెచ్చరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని పురుగు మందులు, ఎరువుల షాపుల యజమానులతో సమావేశం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీఏవో మాట్లాడుతూ ఎమ్మార్పీకి మించి విక్రయాలు జరపకూడదన్నారు. స్టాకు వివరాలను ఎప్పటికప్పుడు బోర్డుపై రైతులకు తెలిసే విధంగా నమోదు చేయాలన్నారు. నిబంధనల మేరకు వ్యవహరించకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్, ఏడీ శ్రీనివాసరెడ్డి, కడియం ఉప సర్పంచ్ వెలుగుబంటి నాని పాల్గొన్నారు.

వశిష్ట గోదావరి ఉగ్రరూపం


ఉసులుమర్రు వద్ద గోదావరి ఉధృతి


ఖండవల్లిలో నీట మునిగిన అరటి తోటలు

- ముంపులో 1100 ఎకరాల్లోని లంక పంటలు
- నేటికి పూర్తిగా మునిగే ముప్పు
- దిక్కుతోచని రైతులు

పెరవలి: గత నాలుగు రోజులుగా కొద్దికొద్దిగా పెరుగుతూ, తగ్గుతూ వచ్చిన వశిష్ట గోదావరి మంగళవారం ఊహించని విధంగా ఉగ్రరూపం దాల్చింది. ఫలితంగా మండలంలోని లంక భూముల్లో సాగవుతున్న వివిధ రకాల పంటలు నీట మునిగాయి. తమ వ్యవసాయ ఉత్పత్తులను ఒబ్బిడి చేసుకునే అవకాశం కూడా లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయానికి దిగువ లంకలు మునిగి ఉండగా, సాయంత్రానికి ఎగువ లంకలను కూడా వరద ముంచెత్తింది. ఈ ఏడాది ఇప్పటికే రెండు సార్లు వచ్చిన గోదావరి పంటలను లంకల్లోని చాలా పంటలు తుడిచి పెట్టుకుపోయాయి. ఇప్పుడొస్తున్న వరద మిగిలిన పంటలను కూడా నాశనం చేస్తుందని రైతులు దీనంగా చెబుతున్నారు. మండలంలోని కానూరు, కానూరు అగ్రహారం, ఉసులుమర్రు, తీపర్రు,కాకరపర్రు, ముక్కామల, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, ముత్యాలవారిపాలెం, లంకమాలపల్లి, ఖండవల్లి, మల్లేశ్వరం గ్రామాల లంక భూముల్లో సుమారు 3 వేల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. వీటిలో 1,100 ఎకరాల్లోని పంటలు పూర్తిగా నీట మునిగాయి. ఈ లంకల్లో కోకో, అరటి, కంద, పసుపు, పామాయిల్, చెరకు తోటలతో పాటు జామ, బొప్పాయి, కొబ్బరి, తమలపాకు తోటలు, కూరగాయల పంటలు, పూలతోటలు, మొక్కజొన్న తోటలు సాగు చేస్తున్నారు.

మంగళవారం రాత్రి నుంచి వశిష్ట గోదావరిలో నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే బుధవారం ఉదయానికి పై లంకలు పూర్తిగా నీటమునిగి పోతాయని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం ధవళేశ్వరం బ్యారేజ్ వద్ద నుంచి 12 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వస్తుండగా బుధవారం ఉదయానికి అది 15 లక్షల క్యూసెక్కులకు చేరవచ్చని అంచనా.

నిమజ్జనాలు వాయిదా వేసుకోండి


గోష్పాద క్షేత్రంలో గోదావరి వరద ఉధృతిని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి, ఎస్పీ నరసింహ కిషోర్

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆదేశం
- ప్రమాదకర స్థాయిలో గోదావరి ప్రవాహం
- ఎస్పీ నరసింహ నాయక్‌తో కలసి కొవ్వూరులో వరద ఉధృతి పరిశీలన

కొవ్వూరు: గోదావరి నది ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నందున వినాయక నిమజ్జనాలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మంగళవారం ఆమె జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్‌తో కలసి కొవ్వూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎగువన భద్రాచలంలో గోదావరి నీటిమట్టం 48 అడుగులకు చేరుకున్నందున బుధవారం సాయంత్రానికి ధవళేశ్వరం ఆనకట్ట వద్దకు 14 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చే అవకాశం ఉందన్నారు. మంగళవారం రాత్రి ఏడు గంటలకు ధవళేశ్వరం వద్ద నీటిమట్టం మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుకుందన్నారు. బుధవారం రెండో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుందని కలెక్టర్ చెప్పారు. ఎగువన గోదావరి క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షాలు కురిస్తే వరద మరింత పెరిగే అవకాశం ఉండవచ్చన్నారు. మరో 24 గంటల పాటు గోదావరి వరద ప్రవాహం ప్రమాదకర స్థాయిలో ఉంటుందన్నారు. కావున అధికారులందరూ అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి స్నానఘట్టంలోనూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రజలెవరినీ నదిలోకి అనుమతించవద్దని సూచించారు. గోదావరిలో కొవ్వూరు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. గోష్పాద క్షేత్రంలోని వరద ప్రవేశించే అవకాశం ఉన్నందున రాత్రి పూట భిక్షగాళ్లు, సాధువులు క్షేత్రంలో నిద్రించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ నరసింహ కిషోర్ ఇక్కడి పోలీసు అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. అంతకు ముందుకు కలెక్టర్ ఎస్పీతో కలిసి మద్దూరులంక గ్రామాన్ని సందర్శించి గోదావరి వరద పరిస్థితిని పరిశీలించారు. కొవ్వూరు సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, డీఎస్పీ కె.దేవకుమార్, పట్టణ సీఐ పి.విశ్వం, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.అజయ్ బాబు, ఇతర అధికారులు వారి వెంట ఉన్నారు.

సర్కారు నిర్లక్ష్యమే విజయవాడ ప్రజలకు శాపం

- బుడమేరు ముంపు ముమ్మాటికీ ప్రభుత్వ వైఫల్యమే
- మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి వెంకట్రావు



కొవ్వూరు: 'చంద్రబాబు తన, తన వారి సొంత ప్రయోజనాల కోసమే బుడమేరు వరదనీటిని వెలగలేరు రెగ్యులేటర్ ద్వారా విడిచి పెట్టి విజయవాడ ముంపునకు కారకుడయ్యారు. ఒకేసారి భారీ ఎత్తున వరదను విడిచి పెట్టినందునే బుడమేరుకు గండ్లు పడి విజయవాడను వరద ముంచెత్తింది. భారీవర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరించినపుడే ముందుస్తుగా ప్రజలను అప్రమత్తం చేయడం ప్రభుత్వం కనీసం ధర్మం. విజయవాడ వరద ముంపునకు కేవలం ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణం. బుడమేరుకు వరద ప్రమాదం పొంచి ఉందని నీటిపారుదల శాఖ ముందస్తుగానే సూచించినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను అప్రమత్తం చేయలేకపోయిందన్నారు. ముంపు పరిస్థితులు ఉన్న ప్రాంత వాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేసి పునరావాస కేంద్రాలకు తరలించి ఉంటే ఇంత నష్టం సంభవించి ఉండేది కాదు. వరద ముంపులో ఉన్న బాధితులకు తక్షణం ఆహారం, తాగునీరు తక్షణం అందించడంలో చంద్రబాబు ప్రభుత్వ యంత్రాంగ పూర్తిగా విఫలం చెందింది. తగినన్ని బోట్లు ఏర్పాటు చేసి ముంపు ప్రాంత వాసులకు సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోనూ అడుగడుగునా నిర్లక్ష్యం కనిపించింది. పూర్తిస్థాయిలో సహాయక చర్యలు అందకపోవడంతో బాధితులు పడరాని పాట్లు పడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా ప్రచార ఆర్భాటాలు మాని బాధితులకు సత్వర న్యాయం చేకూర్చేలా పనిచేయాలి' అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు అన్నారు.

అనధికార డంపింగ్ యార్డ్‌ను తొలగించాలి


నిడదవోలు మార్కెట్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు, స్థానికులు

నిడదవోలు: వందలాది నివాసాల మధ్య మున్సిపాలిటీ నిర్వహిస్తున్న అనధికార డంపింగ్‌యార్డ్‌ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక సంత మార్కెట్ వద్ద పలువురు ధర్నా చేశారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. ఇక్కడి డంపింగ్ యార్డ్‌ను తొలగించాలంటూ గత ఆరు నెలలుగా స్థానిక సంత మార్కెట్‌లోని కూరగాయల వ్యాపారులు, ప్రజలు ఆందోళన చేస్తున్నా మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ నాయకుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ సంత మార్కెట్ వద్ద వ్యర్థాలను డంప్ చేయడం వల్ల, అవి వర్షాలకు తడిసి దుర్వాసన వ్యాపిస్తోందన్నారు. దాంతో పరిసర వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ డంప్ చేసిన వ్యర్థాలను పది రోజుల్లో తొలగించకపోతే అవే వ్యర్థాలను మున్సిపల్ కార్యాలయానికి తరలించి అక్కడ మరోసారి నిరసన వ్యక్తం చేస్తామని రాంబాబు హెచ్చరించారు. డంప్ చేసిన వ్యర్థాల పక్కనే ప్రభుత్వాసుపత్రి, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, వార్డు సచివాలయం, అంబేడ్కర్ విగ్రహం ఉందనే విషయాన్ని మున్సిపల్ పాలకవర్గం గ్రహించకపోవడం శోచనీయమన్నారు. ఆందోళనలో గండి శ్రీనివాసరావు, టి.సుధాకర్, అనిల్ శ్యామ్, ప్రసాద్, అనిల్, నల్లా దుర్గాప్రసాద్, ఎ. గాంధీ, సత్తిపండు పాల్గొన్నారు.

ఇంటింటా జ్వరాలు .. పడకేసిన పల్లెలు

- విజృంభిస్తున్న వైరల్ జ్వరాలు
- రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- పడిపోతున్న రక్త కణాల కౌంట్


గోపాలపురం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు


దేవరపల్లి మండలం దుద్దుకూరు వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

దేవరపల్లి: గ్రామాల్లో వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రతి ఇంట్లోనూ ఇద్దరు లేదా ముగ్గురు జ్వరాలతో మంచాలు పట్టారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వల్లే ఎక్కువగా వైరల్, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో ప్రజలు బాధపడుతున్నారు. టైఫాయిడ్ జ్వరపీడితుల్లో ఎక్కువగా ప్లేట్‌లెట్స్ (రక్త కణాలు) పడిపోతున్నాయి. రక్తకణాల కౌంట్ తగ్గిన రోగులు పట్టణాల్లోని పెద్దాసుపత్రులకు వెళ్లి వైద్యం చేయించుకుంటున్నారు. రక్తకణాలు పడిపోతే వైద్య చేయించుకోలేక సామాన్య, మధ్యతరగతి వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. దాదాపు నెల రోజులుగా అధిక వర్షాలు కురుస్తుండడం, గ్రామాల్లో పారిశుధ్యం లోపించడం, మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండడం వంటి కారణాలతో సీజనల్ వ్యాధులు బాగా ప్రబలాయి.

గ్రామాల్లో వైద్య శిబిరాల ఏర్పాటు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తున్నారు. జ్వర పీడితులకు మందులు పంపిణీ చేస్తున్నారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఇంటింటికీ వెళ్లి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఫీవర్ సర్వే చేసి నమోదు చేస్తున్నారు. అయితే ఎక్కువ మంది ప్రజలు ప్రభుత్వాసుపత్రులకు వెళ్లకుండా ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం పొందుతున్నారు.

కిటకిటలాడుతున్న ఆసుపత్రులు

ప్రభుత్వ, ప్రవేట్ ఆసుపత్రులు రోగులతో కిటకిటలాడుతున్నాయి. ప్రజలను రోజల తరబడి జ్వరాలు పట్టి పీడిస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఎక్కువ మంది వంటి నొప్పులు, కీళ్ల నొప్పులు, తలనొప్పి, జలుబు, జ్వరంతో ఇబ్బంది పడుతున్నారు. వైద్య శిబిరాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేసిన వైద్యాధికారులు వైరల్, టైఫాయిడ్ జ్వరాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. అక్కడక్కడా మలేరియా ఫీవర్లు నమోదవుతున్నాయంటున్నారు. డెంగీ వంటి ప్రమాదకర జ్వరాలు ఎక్కడా నమోదు కాలేదని చెబుతున్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్నిరకాల వైద్య పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయని, వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నట్టు వైద్యాధికారులు తెలిపారు. ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోజుకు 100 నుంచి 120 వరకూ ఓపీ నమోదవుతోంది.